ప్రజాశక్తి
సోమవారం 23 జూన్ 2025
5
శ్రీకాకుళం

ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్

శ్రీకాకుళం సిటీ : శ్రీకాకుళంలో ఒలింపిక్ డే రన్ ఉత్సాహంగా సాగింది. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యాన నగరంలో ఆదివారం నిర్వహించిన ఒలింపిక్ డే రన్‌ను ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ జెండా ఊపి ప్రారంభించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి క్రీడా జ్యోతిని వెలిగించారు. నగరంలోని పొట్టి శ్రీరాములు జంక్షన్ వద్ద ప్రారంభమైన ర్యాలీ పాతబస్టాండ్ నుంచి వైఎస్సార్ సర్కిల్, పాలకొండ రోడ్డు, డే అండ్ నైట్ జంక్షన్, అంబేద్కర్ జంక్షన్ మీదుగా కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణం వరకు సాగింది. కార్యక్రమంలో డిఎస్‌డిఒ కె.శ్రీధర్‌రావు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సిఇఒ పి.సుందరరావు, ఖాసింఖాన్, చిట్టి నాగభూషణం, పిఇటి సంఘ జిల్లా అధ్యక్షులు ఎం.వి రమణ తదితరులు పాల్గొన్నారు.

నో ఎంట్రీ

ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదలై రెండు నెలలు గడిచాయి. అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాలు సైతం విడుదలయ్యాయి. అయినా డిగ్రీ ప్రవేశాలు మాత్రం ఇంకా జరగడం లేదు. అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదలలో ఉన్నత విద్యాశాఖ తీవ్ర జాప్యం చేస్తోంది. గతేడాదీ ఇలాగే ఆలస్యంగా అడ్మిషన్ల ప్రక్రియను చేపట్టడంతో అనేక కళాశాలల్లో పదుల సంఖ్యలో సీట్లు మిగిలిపోయాయి. ఈ ఏడాదీ అవే ఇబ్బందులు పునరావృతం కానుండడంతో కళాశాలల యాజమాన్యాలు గగ్గోలు పెడుతున్నాయి. మరోవైపు విద్యా సంవత్సరం ప్రారంభమైనా ప్రవేశాల జాడ లేకపోవడంతో డిగ్రీలో చేరాలనుకుంటున్న విద్యార్థులు అయోమయంలో ఉన్నారు.

- డిగ్రీ ప్రవేశాల్లో తీవ్ర జాప్యం
- ఇంటర్ ఫలితాలు విడుదలై రెండు నెలలు
- అయోమయంలో విద్యార్థులు
- ఆఫ్‌లైన్‌లో ప్రవేశాలను కోరుతున్న ప్రైవేట్ కళాశాలలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

గతంలో కళాశాల యూనిట్‌గా ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో డిగ్రీ ప్రవేశాలు నిర్వహించేవారు. ఎంపిక చేసిన కళాశాలల్లో విద్యార్థులు దరఖాస్తులు చేసుకుని, సీటు లభించిన కళాశాలలో చేరే వారు. ఇంటర్మీడియట్ మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు నిర్వహించేవారు. 2020 నుంచి ఆన్‌లైన్ విధానంలో ప్రవేశాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రం యూనిట్‌గా విద్యార్థులు వెబ్ బేస్డ్ కౌన్సెలింగ్‌లో ఆప్షన్లు ఇచ్చుకునేవారు. మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు లభించేవి. ప్రైవేట్ కళాశాలల్లో కనీస ప్రవేశాలు జరిగేవి కావు. ప్రైవేట్ కళాశాలలో 70 శాతం కన్వీనర్, 30 శాతం మేనేజ్‌మెంట్ కోటాలో ప్రవేశాలు నిర్వహిస్తారు. మేనేజ్‌మెంట్ సీట్లకు ప్రభుత్వ రాయితీలైన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వంటివి వర్తించవు. ఈ నేపథ్యంలో ప్రైవేట్ యాజమాన్యాలు ఆఫ్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వం ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించాలా?, ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలా? అన్న అంశంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోలేకపోతోంది. మరోవైపు ఈ జాప్యం డిగ్రీలో ప్రవేశాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. కొన్నేళ్లుగా డిగ్రీ ప్రవేశాలు తగ్గుముఖం పడుతున్నాయి.

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని డిగ్రీ కళాశాలలు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్నాయి. 15 ప్రభుత్వ, 88 ప్రైవేట్ కళాశాలలు ఉండగా 23 వేల సీట్లు ఉన్నాయి. కొన్నేళ్ల కిందట జిల్లా నుంచి 18 వేల వరకు సీట్లు నిండేవి.

గత కొన్నాళ్లుగా ఈ సంఖ్య పది వేలకు పడిపోయింది. కొన్ని ప్రైవేట్ కళాశాలల్లో కనీసం ప్రవేశాలు జరగడం లేదు. ప్రభుత్వ కళాశాలల్లో ఆర్ట్స్, కామర్స్ గ్రూపుల్లో ప్రవేశాలు తగ్గుతున్నాయి. దీంతో కొన్ని సబ్జెక్టు కాంబినేషన్ కోర్సులను మూసివేశారు. ప్రధానంగా బిఎస్‌సి ఎంపిసి, కంప్యూటర్స్ కోర్సులకు డిమాండ్ ఉంది. ప్రభుత్వ కళాశాలల్లో శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల, టెక్కలి, నరసన్నపేట, పాతపట్నం వంటి కళాశాలకు డిమాండ్ ఉంది. ప్రైవేట్ కళాశాలలు తీసుకుంటే శ్రీకాకుళం నగరం, రూరల్, రాజాం వంటి ప్రాంతాల్లో పది కళాశాలల్లో సీట్లకు డిమాండ్ ఉంది. ఇంజినీరింగ్ కళాశాలలు అందుబాటులో ఉండడంతో ఎంపిసి పూర్తి చేసిన విద్యార్థులు ఇంజినీరింగ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. దీనికి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా అమలు చేయడంతో విద్యార్థులు అటువైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో డిగ్రీలో ప్రవేశాల సంఖ్య తగ్గుతోంది. ఈ నేపథ్యంలో ఆఫ్‌లైన్ కౌన్సెలింగ్‌ను ఎక్కువ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు కోరుకుంటున్నాయి.

త్వరలో స్పష్టత వచ్చే అవకాశం

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కౌన్సెలింగ్‌పై త్వరలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. స్పష్టత వచ్చాక నోటిఫికేషన్ వస్తుంది. అనంతరం ప్రవేశాలు జరుగుతాయి. మరికొన్ని రోజుల్లో ప్రభుత్వ నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రవేశాలు ఉంటాయి.

- ఎస్.ఉదయ్‌భాస్కర్,
ఎగ్జామినేషన్స్ డీన్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం

ఆఫ్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించాలి

ఆన్‌లైన్ విధానం వల్ల విద్యార్థి కోరుకునే చోట ప్రవేశం లభించం లేదు. జిల్లాకు చెందిన విద్యార్థులకు ఇత జిల్లాలో సైతం ప్రవేశాలు లభిస్తున్నాయి. దీంతో విద్యార్థులు జిల్లాలోని కళాశాలల్లో చేరడం లేదు. ఆఫ్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించాలి. అర్హులైన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు అందజేయాలి.

- పొన్నాన జయరాం,
ఎపి ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అధ్యక్షులు

నూతన విద్యా విధానంతో ప్రైవేటీకరణ

- మూతపడే పరిస్థితుల్లో ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు
- పేద, మధ్యతరగతి విద్యార్థులకు విద్య దూరం
- జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి
- విశ్రాంత డిప్యూటీ డిఇఒ కె.అప్పారావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జాతీయ నూతన విద్యా విధానం ప్రైవేటీకరణకు దారితీస్తుందని విశ్రాంత డిప్యూటీ డిఇఒ కొత్తకోట అప్పారావు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యా రంగాన్ని నాశనం చేసే విధానాలను మానుకోవాలన్నారు. కేరళలో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ 18వ అఖిల భారత మహాసభల సందర్భంగా స్థానిక ఎఎస్ఆర్ జూనియర్ కళాశాలలో 'నూతన విద్యా విధానం - విద్యారంగంపై ప్రభావం' అన్న అంశంపై ఆదివారం విద్యా సదస్సు నిర్వహించారు. తొలుత ఎస్ఎఫ్ఐ జెండాను ఆ సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.వెంకటేష్ ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.పవిత్ర అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ముఖ్య వక్తగా అప్పారావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న విశ్వవిద్యాలయాలు, ఐఐటి, ఎన్ఐటి ఇతర విశ్వవిద్యాలయాల్లో బోధకుల పోస్టుల నియామకం, మౌలిక వసతులు, పరిశోధనాత్మక విద్యకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల్లేక, వసతుల్లేక మూతపడే పరిస్థితుల్లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు మూతపడే పరిస్థితుల్లో ఉండగా, మరోవైపు ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో రూ.లక్షల ఫీజులు చెల్లించి విద్యార్థులు చేరుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యారంగానికి చేటు చేసే నూతన జాతీయ విద్యా విధానం- 2020 రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యతిరేక విధానాలను తీసుకొస్తున్నాయని విమర్శించారు. ఈ విధానాలతో ప్రభుత్వ విద్య నిర్వీర్యం అవుతుందన్నారు. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు ప్రభుత్వ విద్య సంక్షోభంలో ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద, మధ్య తరగతి విద్యార్థులకు విద్యను దూరం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.వెంకటేష్ మాట్లాడుతూ దేశంలో విద్యారంగంలో సమస్యలపై నిస్వార్థంగా పోరాటం చేసే ఏకైక విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ మాత్రమేనన్నారు. విద్యార్థులకు అండగా ఎస్ఎఫ్ఐ ఉంటుందని తెలిపారు. కార్పొరేటీకరణపై భవిష్యత్‌లో పోరాటాలు చేయనున్నట్లు చెప్పారు. ప్రైవేట్ సంస్థల కంటే మెరుగైన విద్యను ప్రభుత్వం అందించాలన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.చందు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం పేరుతో ప్రభుత్వాలు విద్యను పూర్తిగా కాషాయీకరణ, కార్పొరేటీకరణ చేస్తున్నాయని విమర్శించారు. విద్యా రంగాన్ని నిర్వీర్యం చేసే విధానాలు మానుకోపోతే భవిష్యత్‌లో పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. సదస్సులో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.ఖగేష్, జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్.రాజు, జిల్లా కమిటీ సభ్యులు జయరాం, పట్టణ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కీర్తిచక్ర గ్రహీతకు గవర్నర్ అభినందనలు

ప్రజాశక్తి - నౌపడ

సంతబొమ్మాళి మండలం నగిరిపెంటకు చెందిన కీర్తిచక్ర అవార్డు గ్రహీత మేజర్ రాంగోపాల్ నాయుడుకు గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ అభినందనలు తెలిపారు. రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ సరిహద్దుల్లో ఉగ్రవాదులను మట్టుబెట్టడంతో పాటు తోటి జవాన్ల ప్రాణాలు రక్షించడంలో వీరోచిత పోరాటం చేశారని కొనియాడారు. నిస్వార్థంతో దేశానికి సేవ చేసే సైనికులకు దక్కిన అరుదైన గౌరవమన్నారు.

నేడు 'యువత పోరు'

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి - నరసన్నపేట

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక యువత భవిష్యత్ అంధకారంలోకి నెట్టివేయబడిందని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు పేద విద్యార్థులు, నిరుద్యోగ యువత సమస్యలపై ఈనెల 23న రాష్ట్రవ్యాప్త 'యువత పోరు' కార్యక్రమాన్ని శ్రీకాకుళంలో పెద్దఎత్తున నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం పది గంటలకు శ్రీకాకుళం నగరంలోని జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించి ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రతి నియోజకవర్గం నుంచి యువత, విద్యార్థులు పెద్దఎత్తున ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు యువతను మభ్యపెట్టే మోసపూరిత వాగ్దానాలు చేసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్... అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారని, నిరుద్యోగ భృతిగా నెలకు రూ.3 వేలు అందిస్తామన్నారని... అధికారంలోకి రాగానే వీటన్నింటినీ నీరుగార్చారని విమర్శించారు. యువత మనోభావాలకు తూట్లు పొడిచారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకపోతే వెనక్కి తగ్గేది లేదని హెచ్చరించారు.

సమ్మెకు పెన్షనర్ల ఐక్యవేదిక మద్దతు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

అఖిల భారత సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు పెన్షనర్ల సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ ఎం.ఆదినారాయణమూర్తి ప్రకటించారు. నగరంలోని ఎన్‌జిఒ హోంలో పెన్షనర్ల ఐక్య వేదిక సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికులకు నష్టం కలిగించే లేబర్ చట్టాలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. సుదీర్ఘ పోరాటం చేసి కార్మికులు సాధించుకున్న 44 కార్మిక చట్టాలను లు రద్దు చేయడం ఉద్యోగులు, కార్మికులకు తీవ్ర నష్టం చేయడమేనన్నారు. ప్రభుత్వం అమలు చేయదలుచుకున్న పని గంటల పెంపు, మహిళలకు నైట్ షిఫ్టులు, ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ విధానం, జాతీయ ఆస్తుల ప్రైవేటీకరణ వంటి విధానాలు ఉద్యోగులు, కార్మికులు సామాన్య ప్రజలకు నష్టదాయకమని చెప్పారు. ఇప్పటికే పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, సామాజిక అసమానతలు, విద్య, వైద్యం ప్రైవేటీకరణ, తగ్గుతున్న ఉద్యోగ భద్రత వంటి సమస్యలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని తెలిపారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పెన్షనర్లు తమ నిరసన తెలియజేస్తూ జూలై 9న అఖిల భారత సమ్మెకు మద్దతు తెలియజేయడానికి నిర్ణయించుకున్నారని తెలిపారు. సమావేశంలో పలు సంఘాల నాయకులు వి.ఎస్.ఎస్ కేశవరావు, ఎస్.వెంకటరావు (రాష్ట్ర ప్రభుత్వ), డి.పార్వతీశం (ఎడ్యుకేషన్), ఎం.గోవర్ధనరావు (బిఎస్ఎన్ఎల్), కె చంద్రశేఖరరావు, కె.వెంకట్రావు (పోస్టల్), ఎం.ప్రభాకరావు (ఎల్ఐసి), పి.సుధాకరరావు (బ్యాంకు) తదితరులు పాల్గొన్నారు.

ఎంటిసి ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లాలో 1998, 2008 డిఎస్‌సి మినిమం టైమ్ స్కేల్ టీచర్స్‌కు నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అదివారం విద్యాశాఖ అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ ఉపాధ్యాయులు సర్దుబాటు పద్ధతిలో పనిచేస్తూ వస్తున్నారు. ప్రస్తుతం పాఠశాల్లో ఖాళీల బట్టి స్థానాలు ఖరారు చేశారు. జిల్లాలో 1998 బ్యాచ్ 261, 2008 బ్యాచ్ 110 మొత్తం 371 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. మొదట తమకు కౌన్సెలింగ్ నిర్వహించాలని ఈ రెండు బ్యాచ్‌ల ఉపాధ్యాయులు పట్టుబట్టారు. దీంతో కొన్ని గంటల సేపు కౌన్సెలింగ్ నిలిచి పోయింది. విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు నిర్వహించి చివరకు 2008 ఎంటిసి ఉపాధ్యాయులకు మొదట, తర్వాత 1998 ఎంటిసి ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్ ప్రక్రియ సాయంత్రం వరకు నిర్వహించారు. గతంలో సమీప ప్రాంతాల్లో ఈ ఉపాధ్యాయులకు స్థానాలు లభించగా, ప్రస్తుత కౌన్సెలింగ్‌లో మాత్రం దూర ప్రాంతాలకు బదిలీలు జరిగాయి. టైమ్ స్కేల్ వేతనం ఆర్థిక భారంగా ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేసినా, ఎస్‌జిటి ఖాళీల బట్టి మాత్రమే పోస్టింగ్‌లు ఇవ్వగలమని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు. ఆందోళనతో ప్రారంభమైన కౌన్సెలింగ్ చివరకు సజావుగా ముగిసింది. మాన్యువల్ పద్ధతిలో నిర్వహించిన ఈ కౌన్సెలింగ్‌ను జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య పర్యవేక్షించారు.

కౌన్సెలింగ్ కోసం నిరీక్షిస్తున్న ఉపాధ్యాయులు

అరసవల్లి అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక తయారు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అదికారులను ఆదేశించారు. అసరవల్లి ఆలయ కార్యనిర్వాహణాధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కె.ఎన్.వి.డి.వి ప్రసాదరావు నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి పలు సూచనలు చేశారు. సందర్శకులకు అసౌకర్యం కలగకుండా స్వామి దర్శనం కల్పించాలని సూచించారు. ఆలయ అభివృద్ధిపై త్వరలోనే ప్రత్యేక సమావేశం నిర్వస్తానన్నారు.

పాత విధానంలో రేషన్ సరుకుల పంపిణీ ప్రవేశపెట్టిన సందర్భంగా రేషన్ డీలర్ల అసోషియేషన్ ప్రతినిధులు మంత్రిని కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కార్డుదారులు ఇబ్బందులు పడ్డారని, ఎండియు వాహనం ఎప్పుడు వీధిలోకి వస్తుందో తెలియక ప్రజలు ఎదురుచూడాల్సి వచ్చేదన్నారు. రేషన్ దుకాణాలకు రాలేని వృద్ధులు, వికలాంగులకు ఇంటికి తీసుకువెళ్లి సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. మంత్రిని కలిసిన వారిలో డీలర్ల సంఘం ప్రతినిధులు రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌లో వినతుల స్వీకరణ

క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో మంత్రి వినతులు స్వీకరించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు పలు సమస్యలపై వినతులు అందజేశారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వయంగా పరిశీలించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు.

హామీలను ఎప్పుడు అమలు చేస్తారు?

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ఎప్పట్లోగా అమలు చేస్తారని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, జిల్లా కమిటీ సభ్యులు నంబూరు షణ్ముఖరావు డిమాండ్ చేశారు. మండలంలోని జక్కరపేటలో సిపిఎం మండల కన్వీనర్ కొల్లి ఎల్లయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి పాలన ఏడాదిలో ఏమాత్రం సంతృప్తికరంగా లేదన్నారు. ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేస్తామని, జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, జీడి బోర్డు ఏర్పాటు చేస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. వంశధార నిర్వాసితులకు స్పెషల్ ప్యాకేజీ ఇస్తామని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి చివరి భూముల వరకు నీరందిస్తామని చెప్పి విస్మరించారని చెప్పారు. జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తామని చేసిన వాగ్దానాన్నీ ఎందుకు అమలు చేయలేకపోయారో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఐటిడిఎ లేకపోవడం వల్ల గిరిజనులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, గిరిజనుల భూములను గిరిజనేతరులు తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వంశధార రిజర్వాయరును పూర్తి చేసి చివరి భూముల వరకు రెండు పంటలకు నీరు ఇవ్వాలని, నేరడి వద్ద బ్యారేజీ నిర్మించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు స్పెషల్ ప్యాకేజీ ఇవ్వాలని, రిమ్స్ ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అక్రమ మైనింగ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో భూ దోపిడీ ఆపాలని, సముద్రతీర ప్రాంతాన్ని కార్పొరేట్లకు అప్పగించే ప్రయత్నాలు మానుకోవాలన్నారు. కోడిరామ్మూర్తి స్టేడియం నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ప్రజల మద్దతుతో ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం మండల కన్వీనర్ కొల్లి ఎల్లయ్య, నాయకులు హనుమంతు ఈశ్వరరావు, బి.వాసుదేవరావు, ఉరజాన లక్ష్మణరావు, ఉరజాన దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

కళాశాలలపై నిరంతర పర్యవేక్షణ

- ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు జూలైలో తల్లికి వందనం
- యుడిఐఎస్ఇలో విద్యార్థుల వివరాల నమోదు
- ఆర్ఐఒ ప్రగడ దుర్గారావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఇటీవల పదో తరగతి ఉత్తీర్ణత చెంది ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరే విద్యార్థులకు జూలైలో ప్రభుత్వం తల్లికి వందనం ఇవ్వనుందని ఇంటర్ బోర్డు ప్రాంతీయ తనిఖీ అధికారి (ఆర్ఐఒ) ప్రగడ దుర్గారావు తెలిపారు. ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా విద్యార్థుల వివరాలను యునిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్‌లో నమోదు చేస్తున్నామని చెప్పారు. ఈ ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు.

జిల్లాలోని ప్రైవేట్ కళాశాలల నిర్వహణ తీరుపై నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నామని కళాశాలల్లో లేబొరేటరీస్, ఇతర సౌకర్యాల కల్పనలో ప్రైవేట్ కళాశాలలు వెనుకాడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రైవేట్ కళాశాలల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించిన తర్వాతే అనుతులు జారీ చేస్తున్నామని తెలిపారు. అనుమతులు లేకుండా కళాశాలలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రైవేట్ కళాశాలల్లో సౌకర్యాలు, తరగతులు, ఇంటర్ పరీక్షల నిర్వహణ, యునిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ ప్రక్రియ వంటి అంశాలపై ఆయన 'ప్రజాశక్తి' ముఖాముఖిలో మాట్లాడారు.



? జిల్లాలోని ప్రైవేట్ కళాశాలలన్నింటికీ అనుమతులు ఉన్నాయా?

జిల్లాలో 71 ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో 11,300 మంది ద్వితీయ, సుమారు ఐదు వేల మంది ప్రథమ విద్యార్థులు చదువుతున్నారు. అన్ని కళాశాలలకు అనుమతులు ఉన్నాయి. అనుమతులు లేకుండా తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం.

? కొత్త కళాశాలల ఏర్పాటుకు సంబంధించి నిబంధనలు సరిగా పాటించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి?

అటువంటిదేమీ లేదు. కొత్త కళాశాలల ఏర్పాటు కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో పరిస్థితులను చూస్తున్నాం. ఆ ప్రాంతంలో కళాశాల ఏర్పాటు అవసరం ఉందని భావిస్తే, ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నాం. ప్రభుత్వం ఆ మేరకు వాటికి అనుమతులు జారీ చేస్తుంది.

? ప్రైవేట్ కళాశాలల్లో వసతి సౌకర్యాలు, లేబొరేటరీ సౌకర్యాలపై ఇటీవల ఏమైనా తనిఖీలు నిర్వహించారా?

ప్రైవేట్ కళాశాలల్లో వసతి, లేబొరేటరీ ఇతర సౌకర్యాలపై ఈ ఏడాది ఏప్రిల్, మేలో ముగ్గురు సభ్యుల కమిటీ తనిఖీలు చేపట్టింది. 27 కళాశాలలు అదనపు సెక్షన్ల నిర్వహణకు దరఖాస్తులు పెట్టాయి. వాటిలో ఇప్పటివరకు ఆరు కళాశాలలకు క్లియరెన్స్ ఇచ్చాం.

? కళాశాలల్లో విద్యార్థుల భద్రతతో పాటు ఆట స్థలాలకు ఏర్పాటు వంటి నిబంధనలు పాటిస్తున్నాయా?

అన్ని కళాశాలలు ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని కళాశాలలకు ఆట స్థలాలు ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని కళాశాలలు ఏదైనా జిమ్ సెంటర్‌లో తమ పిల్లలు వ్యాయామం చేస్తున్నారని సర్టిఫికేట్ తెచ్చుకుని నిర్వహించుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించింది.

? విద్యార్థుల నమోదుకు సంబంధించి యుడిఐఎస్ఇ ప్రక్రియ ఎలా సాగుతోంది?

ప్రతి విద్యార్థికి సంబంధించిన డేటాను యునిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ విధానం ద్వారా అప్‌లోడ్ చేస్తున్నాం. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వారికి సంబంధించి ప్రొగ్రెసెన్ ప్రక్రియ నిర్వహిస్తున్నాం. ప్రథమ సంవత్సరం విద్యార్థులను ఇంపోర్టు చేసే ప్రక్రియ ప్రస్తుతం సాగుతోంది.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు

రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- నందిగాం

మండలంలో రూ.11 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్కలి నియోజకవర్గంలో రూ.600 కోట్లతో ప్రతి ఇంటికి తాగునీరు అందించే ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. గతంలో ఒక్కరికే తల్లికి వందనం అందేదని, ఇప్పుడు ఎందరు పిల్లలున్నా అందిస్తున్నామన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ పథకాన్ని రైతులకు అందిస్తామన్నారు. మండలంలోని బడ బంధ జంక్షన్ నుంచి రొంపివలస రైల్వే హాల్ట్ వరకు రూ.3 కోట్ల అంచనా వ్యయంతో రహదారి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే పెంట ఊరు నుంచి వయా శివరాంపురం, రౌతుపురం, సైలాడ, డబ్బూరుపాడు మీదుగా పోల్లాడ వరకు రూ.ఐదు కోట్ల 85 లక్షల అంచనా వ్యయంతో ఆయన శంకుస్థాపన చేశారు. నందిగాం మీదుగా సుబ్బమ్మపేట రహదారికి రూ.కోటి 20 లక్షలతో శంకుస్థాపన చేశారు. కోటిపల్లి నుంచి కోటియా కొండపేట వరకు రూ.40 లక్షలతో నిర్మించిన రహదారిని ఆయన ప్రారంభించారు. శివాలయం నుంచి ఎస్‌సి కాలనీ వరకు రూ.20 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన సిసి రహదారిని ప్రారంభించారు. నందిగాం ప్రాథమిక పాఠశాల నుంచి ఆంజనేయ టెంపుల్ వరకు రూ.పది లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. రూ. 20 లక్షలతో ప్రగతి స్కూల్ నుంచి ఎస్‌సి వీధికి సిసిరోడ్డు, కాలువ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు వెనకాల అజయ్ కుమార్, నాయకులు ఎం.బాలకృష్ణ, కొన్ని ప్రసాదరావు, ఎ.కూర్మారావు, నందిగాం తిరుపతిరావు, కొల్లి హరిబాబు, సుదర్శనరావు, బెండి గిరిబాబు, నాగరాజు, మెట్ట పద్మావతి, సింహాచలం పాల్గొన్నారు.

'యువత పోరు' విజయవంతం చేయాలి

రణస్థలం : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్

ప్రజాశక్తి- రణస్థలం

యువత పోరు నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే, సమన్వయ కర్త గొర్లె కిరణ్ కుమార్ ఆదివారం పిలుపునిచ్చారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను మోసగించిందన్నారు. అధికారంలోకి వచ్చేందుకు చంద్రబాబు అనేక హామీలు ఇచ్చారని, ఆరు పథకాలకు సూపర్ సిక్స్ అని పేరు పెట్టి వాటిలో ఒక్క తల్లికి వందనం అమలు చేసి సూపర్ సిక్స్ పూర్తయిందనడం విడ్డూరంగా ఉందన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న ఊసే లేదన్నారు. ఉద్యోగం లేకపోతే నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని చెప్పి ఏడాదైనా ఇప్పటికీ ఆ విషయం పట్టించుకోలేదన్నారు. చంద్రబాబు చేసిన మోసాలను ఎండగట్టేందుకు సోమవారం శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయం ఎదుట యువత పోరు కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలో ఉండే యువత అంతా పాల్గొని యువత పోరు నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: సోమవారం జరగనున్న యువతపోరు కార్యక్రమంలో పెద్దఎత్తున యువత పాల్గొని విజయవంతం చేయాలని నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త చింతాడ రవికుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని బొడ్డేపల్లిపేటలో నున్న వైసిపి కార్యాలయంలో యువజన విభాగం నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు వండాన సూరపునాయుడు, జిల్లా ఇంటలెక్చువల్ విభాగం అధ్యక్షులు కొప్పల ఈశ్వరరావు, జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు బల్ల సత్యన్నారాయణ, సరుబుజ్జిలి మాజీ జెసిఎస్ కన్వీనర్ అత్తులూరి రవికాంత్, దానేటి రామ్మోహన్, సరుబుజ్జిలి సర్పంచ్ బొడ్డేపల్లి హరి, దన్నాన అజయ్ కుమార్, మామిడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో సమగ్రాభివృద్ధి

ఎమ్మెల్యే రవికుమార్

రహదారులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఐదేళ్లలో ఆమదాలవలస నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే, పియుసి చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. మండలంలోని కనుగులవలసలో రూ.కోటి నిధులతో నిర్మాణం పూర్తి చేసుకున్న 18 సిసి రహదారులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో పదవులు శాశ్వతం కాదన్నారు. కొంతమంది నాయకులు గతంలో ఆమదాలవలసను అందాలవలసగా తీర్చిదిద్దుతానని ప్రగల్భాలు పలికారన్నారు. తాను వారిలా మాటల మనిషిని కాదని, చేతల మనిషినన్నారు. ఈ ఏడాది కాలంలో రూ.500 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. సిఎస్‌పి రహదారి నుంచి ముద్దాడపేట వరకు రహదారికి రూ.13 కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే రహదారి విస్తరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఏడాదిలో గ్రామంలో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తానని చెప్పారు. ప్రతి గ్రామానికి రహదారి, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గత ప్రభుత్వం, కూటమి ప్రభుత్వ పాలనలో తేడాను ప్రజలే బేరీజు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్, టిడిపి మండల అధ్యక్షులు నూక అప్పల సూరనాయుడు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, నారాయణపురం ఆనకట్టు చైర్మన్ సనపల ఢిల్లేశ్వరరావు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షులు తమ్మినేని సుజాత, బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ సూరపునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ ఆదిఆంధ్రవీధిలో తాగునీరు కోసం ప్రజలు అనేక కష్టాలు పడుతున్నారు. ఎస్‌సి కాలనీలోకి కొంత మంది మహిళలు ఖాళీ బిందెలతో ఆదివారం కాలనీలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందించాలని పథకాలు పెడుతుంటే కొన్నేళ్లు గడుస్తున్నా నేటికీ తాగునీరు అందని పరిస్థితి ఏర్పడిందని, ఎస్‌సి కాలనీలో కొన్ని వీధులకు నీరందిస్తూ మరికొన్ని వీధులకు అసలు పైపులైనే ఇవ్వలేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లాస్థాయి అధికారులు స్పందించి తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన తెలిపిన వారిలో ఎర్ర తిరుపతమ్మ, జోగి సింహాద్రి, ఎర్ర ఆదిలక్ష్మి, ఎర్ర సుశీల, పాల లక్ష్మి, కాల దయాని, దండాసి రాములమ్మ, ఎర్ర మాధవి, జోగి సిమ్మాలమ్మ, జోగి సుబ్బమ్మ, కాల జ్యోతమ్మ, జోగి లక్ష్మి, అనురాధ, కృష్ణవేణి, దాసరి అప్పయ్య, జోగి శ్రీనివాసరావు తదితరులున్నారు.

కార్యకర్తలే కీలకం

రణస్థలం: స్థానిక వైసిపి కార్యాలయంలో జెఆర్‌పురం పంచాయతీ కార్యకర్తలతో ఆదివారం ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే, సమన్వయ కర్త గొర్లె కిరణ్‌కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి అండ కార్యకర్తేనని, పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా పార్టీకోసం అహర్నిశలూ శ్రమించింది కార్యకర్తే అని గుర్తుచేశారు. కార్యకర్తలను కూటమి నాయకులు ఎన్నో ప్రలోభాలకు గురిచేసినా ఏ ఒక్క కార్యకర్త తలొగ్గలేదన్నారు. ఎటువంటి సమస్య వచ్చిన నేరుగా వచ్చి తనను సంప్రదించాలని వాటిని పరిష్కారం చేసే దిశగా అడుగులు వేస్తానన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రాయపురెడ్డి భుజంగరావు, వైసిపి రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి పిన్నింటి సత్యం నాయుడు, సర్పంచ్ బవిరి రమణ, ఎంపిటిసి ప్రతినిధి పచ్చిగుల్ల సాయిరాం, ఎచ్చెర్ల నియోజకవర్గ డాక్టర్స్ విభాగం అధ్యక్షులు దుర్గాసి రామారావు, ముద్దాడ రాజశేఖర్, ఉప సర్పంచ్ దన్నాన సీతారాం, మాజీ ఎంపిటిసి ఇడదాసుల తిరుపతి రాజు తదితరులు పాల్గొన్నారు.

గాండ్ల తెలికులు అన్నిరంగాల్లో ఎదగాలి

శ్రీకాకుళం సిటీ: తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 35 లక్షల జనాభా కలిగిన గాండ్ల తెలుకుల సామాజిక తరగతి ఆర్థికంగా, రాజకీయంగా వెనకబడి ఉందని, సామాజికంగా ఎదగాలని అఖిల గాండ్ల తెలికుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరవ అనంతం అన్నారు. నగరంలోని అఖిల గాండ్ల తెలికుల సంఘం సామాజిక భవనంలో ఆదివారం గాండ్ల తెలుకుల జిల్లా సర్వసభ్య సమావేశం జిల్లా అధ్యక్షులు కొమనపల్లి లక్ష్మణప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం గాండ్ల తెలుకుల సామాజిక తరగతి నువ్వులు, వేరుశనగతో పాటు మరికొన్ని విత్తనాల నుంచి తైలం తీసే వృత్తి చేపట్టి, గౌరవంగా జీవించే పరిస్థితి ఉండేదన్నారు. కర్ర గానుగుల స్థానంలో యాంత్రీకరణ చోటు చేసుకోవడంతో ఉపాధిని కోల్పోయిందన్నారు. అనంతరం గ్రోసుల గోపాలయ్య మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఇంటర్, టెన్త్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గోల్డ్ మెడల్‌తో పాటు ఒక్కొక్కరికి రూ.5 వేలు పారితోషకాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దాసరి జ్ఞానమూర్తి, రాష్ట్ర గౌరవ సలహాదారు ఇంజరాపు విశ్వనాథం, కెల్లా శ్రీనివాస్, జోన్‌వన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర రవిచంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షులు కెల్లా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

తేజేశ్వరరావును కలిసిన అగతముడి

తేజేశ్వరరావుతో బైరాగినాయుడు

కొత్తూరు: కమ్యూనిస్టు కురు వృద్ధుడు చౌదరి తేజేశ్వర రావును కుంటిభద్ర గ్రామానికి చెందిన గురండి ఎంపిటిసి అగతముడి భైరాగినాయుడుతో పాటు ఆయన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీకాకుళం కేంద్రంలో ఆయన నివాసానికి వెళ్లి కలిశారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించు కున్నారు. ఇరువురు గత 30 ఏళ్ల క్రితం అనేక కమ్యూనిస్టు ఉద్యమాల్లో కలిసి పనిచేశారు. ఈ సందర్భంగా యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈయనతో పాటు పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు అగతముడి అరుణకుమార్ ఉన్నారు.

డిఎల్‌టిసి మిగులు సీట్లకు ప్రవేశాలు

రామ్మోహనరావు

శ్రీకాకుళం సిటీ: పట్టణంలోని బలగ కూడలి వద్ద ఉన్న డిఎల్‌టిసి ఐటిఐలో మొదటి కౌన్సెలింగ్‌లో మిగులు సీట్లుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎడి ఎ. రామ్మోహన్‌రావు ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు సద్వినియోగం చేసు కోవాలని సూచించారు. రెండేళ్ల కోర్సులు ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మోటార్ మెకానిక్, డ్రాఫ్ట్‌మ్యాన్ అండ్ సివిల్, ఏడాది కోర్సులు కోపా, వెల్డర్, సూయింగ్ టెక్నాలజీ ఉన్నాయన్నారు. జూలై 15లోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, 17లోగా దరఖాస్తులను డిఎల్‌టిసికి అందించాలని, 21న కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

ప్రాణాలంటే లెక్క లేదా...?

అప్పలపేట వద్ద పూర్తిగా పాడైన ప్రధాన రహదారి

లక్కుపురం వద్ద ప్రధాన రహదారిలో గొయ్యి వద్ద వేసిన ముళ్ల కంపలు

ప్రజాశక్తి- బూర్జ

రహదారిపై ఏర్పడిన గోతులు కారణంగా ప్రమాదాలకు గురై ప్రాణాలు పోతున్నా అధికారులకు లెక్క లేదా అని మండల పరిధిలో ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని పాలవలస గ్రామ సమీపంలో పాలకొండ - శ్రీకాకుళం ప్రధాన రహదారిపై గొయ్యి కాస్త చెరువును తలపించేలా తయారై ప్రమాదాలకు హేతువుగా మారింది. ఈ ప్రధాన రహదారిపై అనునిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే వాహనదారులు గమనించక పోవడంతో ప్రమాదవశాత్తు గోతిలో పడిపోయి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. వర్షం పడితే చెరువు మాదిరిగా తయారై వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు అడుగడుగునా గోతులుగా తయారవ్వడంతో ఒక గొయ్యిని తప్పించబోయి మరో గోతిలో పడి తీవ్ర గాయాలకు గురైన సంఘటనలున్నాయి. ఈ విషయంపై అధికారులకు, ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదులు ఇచ్చినప్పటికీ పట్టించుకోకపోవడంలో ఉన్న ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రాణాలంటే అధికారులకు లెక్కలేదని మండిపడుతున్నారు. రహదారులను మరమ్మతులు చేస్తామని, నూతన రహదారులు ఏర్పాటు చేస్తామని ప్రకటనలు గుప్పించిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని గ్రామ ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గోతులను పూడ్చి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

విద్యారంగ అభివృద్ధికి ఢిల్లేశ్వరరావు విశిష్ట సేవలు

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్


ఢిల్లేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- పలాస

విద్యారంగా అభివృద్ధికి ఢిల్లేశ్వరరావు విశిష్ట సేవలు అందించారని, నాలుగు దశాబ్దాలకుపైగా విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో విశేషంగా కృషి చేశారని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సంపత్ రావు కిషోర్ అన్నారు. ఆదివారం స్థానిక కె.వి.ఆర్ కళ్యాణ మండపంలో యుటిఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించా లన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో 36 ఏళ్లుగా పనిచేస్తూ ఎంతో మంది విద్యార్థుల బంగారు భవిష్యత్‌ను తీర్చిదిద్ది ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన ఉపాధ్యాయుడు ఢిల్లేశ్వరరావు అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేసిన వ్యక్తిని, ఏ పాఠశాలలో పనిచేసినా అంకిత భావంతో పని చేసేవారన్నారు. ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సర్వ సాధారణమని విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపుగా నిలుస్తాయన్నారు. అనంతరం ఢిల్లేశ్వరరావు మాట్లాడుతూ తాను ఉద్యోగ విరమణ చేసినా విద్యార్థులకు తనవంతుగా విద్యను అందించి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేయడమే కాకుండా యుటిఎఫ్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఢిల్లేశ్వరరావు దంపతులను ఘనంగా సన్మానించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఇఒ సిహెచ్ శ్రీనివాసరావు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు, ఎల్.వి.చలం, సీనియర్ నాయకులు బోడ్డేపల్లి మోహనరావు, కె.దాలయ్య, బల్ల చిట్టిబాబు, పలాస మండలశాఖ అధ్యక్షులు టి.జయరాం, ఎస్.వి.రమణ, తమ్మినాన ఎర్రన్న, ఉప్పాడ రమేష్, ఎస్.మోహనరావు, కె.ప్రసాదరావు, గున్న మధుసూదనరావు, కంసరాన ప్రసాద రావు, గుంట కోదండరావు, బల్ల చిట్టిబాబు, కంచరాన జయరాం, రమేష్, నాగేశ్వరరావు, చందు, బెండి లక్ష్మి, గొండు మధు, ఎస్.వెంకటరమణ, పురుషోత్తం, భానుమతి, మోహనరావు, ఎన్.వి పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు సిఎం సహాయనిధి అండ

బాధితులకు చెక్కులను అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: వైద్య ఖర్చులతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అభాగ్యులకు ఆపన్నహస్తంలా సిఎం సహాయనిధి మారిందని రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో 17 మందికి రూ. 12.19.743ల సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ నిరుపేదలకు అండగా సిఎం సహాయనిధి కొండత భరోసా కల్పిస్తోందన్నారు. నందిగాం మండలానికి చెందిన బి. జానకిరావుకు రూ.42,708, బి.శకంతులకు రూ. 50,861, సంతబొమ్మాళి మండాలనికి చెందిన కె.గణేష్‌కు రూ.72,500, పి.సరస్వతికి రూ. 20 వేలు, జె.సావిత్రి రూ.52,550, హేమలతకు రూ.87,452, పి.చిన్నారావుకు 1,09350, కోటబొమ్మాళి మండలానికి చెందిన ఎం.రాంబాబుకు రూ.51,500, పి.ఆరుంద్రకు రూ.1,20,000, ఎస్.మోక్షితకు రూ.66,423, కె.మల్ల మ్మకు రూ.45 వేలు, యశ్వత్‌కు రూ.41,136, టెక్కలి మండలానికి చెందిన టి.వెంకటరమణకు రూ.1,13,525, సుజాతకు రూ.2,00,738, ఆర్. కృష్ణారావుకు రూ.60వేలు, ఆర్,వెంకటరమణకు రూ.30వేలు, పి.సుశీలకు రూ.40వేలు చెక్కులను అంద జేశారు. కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు కింజ రాపు హరివరప్రసాద్, మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, అజయ్‌కుమార్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ రాంజీ

ప్రజాశక్తి- కవిటి

వాతావరణంలో మార్పులు, ఇటీవల కురిసిన వర్షాలతో సీజనల్ జ్వరాలు వస్తున్నాయని వీటిపై అప్రమత్తంగా ఉండాలని కవిటి సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ రాంజీ తెలిపారు. ఈ మేరకు ప్రజాశక్తితో మాట్లాడిన ఆయన గ్రామీణ ప్రాంతాల్లో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు సామాజిక పరిశుభ్రత అవసరమన్నారు. ప్రతిఒక్కరూ కాచి వడపోసిన నీటిని తాగాలని, అదే సమయంలో పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకుంటూ ఫాస్ట్‌ఫుడ్ ఆహారాన్ని తగ్గించుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఒంట్లో కొంచెం నలతగా ఉన్నప్పుడు కూడా మెడికల్ షాపుల్లో మందులు కొని వాడడం కంటే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో సంప్రదించాలన్నారు. కవిటి సిహెచ్‌సితో పాటు మండలంలోని నాలుగు పిహెచ్‌సిల్లో వైద్యులు నిరంతరం సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల ఆస్పత్రికి వచ్చే రోగుల డేటా నిక్షిప్తం కోసం ప్రభుత్వం ఆధార్ కార్డు తప్పనిసరి చేసిందని, ఆస్పత్రికి వచ్చే ప్రతి రోగి ఆధార్ కార్డు తీసుకుని రావాలన్నారు. ఒకసారి ఒక వ్యక్తి డేటా ఆస్పత్రిలో నిక్షిప్తం చేస్తే మరోసారి ఆధార్ కార్డు అవసరం ఉండదని, భవిష్యత్‌లో ఆ వ్యక్తి వైద్యం కోసం ఎప్పుడు వెళ్లినా ఆయన సమాచారం మొత్తం దాంట్లో ఉంటుందని, దానికి తగ్గట్టుగా ఆయనకు వైద్యం అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం పేద ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటోందని దానిని ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఎన్నిక

నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న క్రీడాకారులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌ని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని క్రిస్టల్ ప్యాలెస్‌లో ఆదివారం రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సమావేశాన్ని నిర్వహించి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా ప్రముఖ వ్యాపారవేత్త సూర శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ నూతన కార్యవర్గంలో వైస్ ప్రెసిడెంట్‌గా సిహెచ్ కామేశ్వరి (నెల్లూరు), స్టేట్ సెక్రటరీ సూర శ్రీనివాస్ (శ్రీకాకుళం), జాయింట్ సెక్రటరీగా ఎ. నాగ రాంప్రసాద్ (ఈస్ట్ గోదావరి), పి.సంపత్ రెడ్డి (గుంటూరు), సిఇఒ వెంకటేశ్వర్లు (అనంతపురం), ఎంవి రమణ, కన్వీనర్ (శ్రీకాకుళం), పి.నరసింహ రెడ్డి (గుంటూరు), ఆర్గనైసింగ్ సెక్రటరీలను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు ఎన్నికల అధికారిగా రిటైర్డ్ జడ్జి పప్పల జగన్నాధరావు, ఇండియా ఫెడరేషన్ సెక్రటరీ అఫ్ సాఫ్ట్‌బాల్ ప్రవీణ్ ఆరోరా పర్యవేక్షించారు. సాఫ్టబాల్ ప్రగతికి కృషిచేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది.

ఉపాధ్యాయ వృత్తికి 'కుప్పిలి' ఆదర్శం


దుర్గా ప్రసాదరావు

ప్రజాశక్తి- పలాస

ఆయన ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు. అంకితభావంతో పనిచేసే వ్యక్తి. 41 ఏళ్ల సర్వీస్‌లో మచ్చలేదు. ఎక్కడ పని చేసినా ఆయా ప్రాంతాల్లో అక్కడ ప్రజల నుంచి మన్ననలు పొందేవారు. ఆయనే కుప్పిలి దుర్గాప్రసాదరావు. తన తండ్రి ఎంపిడిఒగా పని చేస్తున్న సమయంలో తాను కూడా ప్రభుత్వ ఉద్యోగం సంపాదించి ప్రజలకు సేవ చేయాలని చిన్నతనం నుంచి తపన పడే వ్యక్తి. డాక్టర్, మెరైన్ ఇంజనీర్ చేయాలని ఆయన కోరిక. తన తండ్రి ఆయా విభాగాల్లో చదివించే స్తోమత లేదని చెప్పడంతో తండ్రి మాటకు కట్టుబడి తన ఆశయాన్ని పక్కనపెట్టి ఉపాధ్యాయ వృత్తిలో చేరారు. ఆయన దగ్గర చదువుకున్న విద్యార్థులు ఎంతో మంది ప్రభుత్వ అధికారులుగా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. తన ఆశయాన్ని తన కుమారుల రూపంలో నేరవేర్చుకొని ఆనందం పొందుతున్నారు. 1963 అక్టోబర్ 2న జన్మించారు. 1984 జనవరి 30న ఉద్యోగంలో చేరి ఈనెల 30న పదవీ విరమణ చేయనున్నారు.

నందిగాం మండలం సింగుపురానికి చెందిన కుప్పిలి మల్లేశ్వరావు, సూర్యం దంపతులకు ముగ్గురు సంతానంలో దుర్గా ప్రసాదరావు ఒకరు. తండ్రి మల్లేశ్వరావు ఎంపిడిఒగా పనిచేస్తున్న సమయంలో తన సొంత గ్రామం సింగుపురం నుంచి కాశీబుగ్గ, పలాస ఉదయ పురం వచ్చి స్థిరపడ్డారు. 1989 నవంబర్ 15న శ్రీకాకుళంకు చెందిన అంబా భవానీతో వివాహ మైంది. వీరికి కుమారులు సంతోష్ కుమార్, లలితాప్రసాద్ ఉన్నారు.

విద్యాభ్యాసం

తండ్రి మల్లేశ్వరావు ఎంపి డిఒగా పనిచేస్తున్న సమ యంలో కాశీబుగ్గలో నివాసం ఉండడంతో ఆయన విద్యా భ్యాసమంతా కాశీబుగ్గ, పలాసలోనే జరిగింది. 1 నుంచి 5 వరకు కాశీబుగ్గ నీల్‌కమల్ ప్రాథమిక పాఠశాల, 6 నుంచి పదోతరగతి వరకు కాశీబుగ్గ ఉన్నత పాఠశాల, ఇంటర్మీ డియట్ పలాస జూనియర్ కళాశాలలో అభ్యసించగా, టిటిసి వమ్మరవల్లి, డిగ్రీ, పిజి, బిఇడి ఆంధ్రాయూనివర్సిటీ విశాఖలో చేశారు. ఈయనకు పుస్తకాలు చదవడం, వ్యాయామం, జాతీ య, అంతర్జాతీయ విషయాలు తెలుసుకోవడం అలవాటు.

అంకితభావానికి మారుపేరు

దుర్గా ప్రసాదరావు పిన్న వయసులోనే ఉద్యోగం సంపాదించి 41 ఏళ్లు ఉపాధ్యాయ వృత్తిలో పనిచేశారు. అప్పటి సిఎం ఎన్‌టి రామారావు హయాంలో స్పెషల్ టీచర్స్ పోస్టుల నియామకాలు చేపట్టడంతో 1984 జనవరి 30న పలాస మండలం అల్లుకోల ప్రాథమిక పాఠశాలలో మొదటిసారిగా ఉపాధ్యాయ వృత్తిలో చేరారు. 1986 నుంచి 2005 వరకు పలాస మండలం శాసనం, మొగిలిపాడు, పలాస ఎంపిపి పాఠశాలల్లో పని చేశారు. అక్కడ నుంచి పదోన్నతిపై వజ్రపుకొత్తూరు మండలం సుంకర జగన్నాధపురం, పలాస మండలం పెంటి భద్ర, మందస, ప్రస్తుతం పలాస మండలం ఉదయపురం ఎంపిపి పాఠశాలల్లో హెచ్‌ఎంగా పనిచేస్తూ ఈనెల 30న పదవీ విరమణ చేయనున్నారు.

తండ్రి మాటకు కట్టుబడి...

దుర్గా ప్రసాదరావు తండ్రి మాటకు కట్టుబడి పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధించారు. ఆయనకు వచ్చిన మార్కులకు మెరైన్, ఇంజినీర్ చదువుకు అవకాశం వచ్చింది. చిన్నతనం నుంచి మెరైన్ ఇంజినీర్, డాక్టర్ చదవాలని కోరిక. అయితే తండ్రి మల్లేశ్వరావు మెరైన్ ఇంజినీర్, డాక్టర్ చదివించే స్తోమత లేదని చెప్పడంతో ఉపాధ్యాయ వృత్తిలో చేరారు. అక్కడితో ఆగకుండా ఆయన పెద్ద కుమారుడు సంతోష్ కుమార్ ఇంజినీరింగ్, చిన్న కుమారుడు లలితా ప్రసాద్‌ను డాక్టర్‌గా చదివించి తన కోరికను తీర్చుకున్నారు. ప్రస్తుతం సంతోష్‌కుమార్ హైదరాబాద్‌లో యాక్సెస్‌బ్యాంకు జోనల్ మేనేజర్‌గా పనిచేస్తుండగా, చిన్న కుమారుడు లలితా ప్రసాద్ విశాఖపట్నం ఆంధ్రా మెడికల్ కళాశాలలో డిఎం న్యూరాలజీ చదువుతున్నారు.

అవార్డులు

దుర్గా ప్రసాదరావు తన 41 ఏళ్ల సర్వీస్‌లో అంకితభావంతో పనిచేసి విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించారు. పలాస మండలం మొగిలిపాడు పాఠశాలలో పనిచేసే సమయంలో అక్షరక్రాంతి కార్యక్రమం నిర్వహించడంలో అప్పటి జిల్లా కలెక్టర్ ఎస్‌పి సింగ్ చేతులమీదుగా బెస్ట్ క్లస్టర్ కో-ఆర్డినేటర్‌గా అవార్డు అందుకున్నారు. పలాస ఎంపిపి పాఠశాలలో పనిచేస్తున్న సమయంలో మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజర్ నుంచి బెస్ట్ పర్సన్ అవార్డు లభించింది.

కొట్లాటలో తమ్ముడు మృతి

మృతి చెందిన తవిటినాయుడు

ప్రజాశక్తి- నందిగాం

మండలం కామ దేనవు గ్రామానికి చెందిన కిల్లి తవిటి నాయుడు (37) తన అన్నయ్య ధర్మారావు చేతిలో ఆదివారం సాయంత్రం హత్యకు గురయ్యాడు. వివరాల్లోకి వెళ్తే... కామదేనువు గ్రామానికి చెందిన తవిటి నాయుడు తన అన్న ధర్మారావుకు గత కొంతకాలంగా భూ విషయమై ఘర్షణ జరుగుతుంది. అయితే ఖరీఫ్‌సీజన్ కావడంతో గట్లును సరి చేసుకోవడానికి వెళ్లిన ఇద్దరూ మాటామాట పెరిగి కొట్లాటకు దారి తీసింది. ఈ కొట్లాటలో ధర్మారావు గడ్డపారతో తవిటినాయుడు తలపై మోదడంతో రక్తస్రావమై కుప్పకూలి పోయాడు. మృతుని తండ్రి లక్ష్మణరావు ఫిర్యాదు మేరకు నందిగాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుర్బలాపురంలో విషాదం

ఢిల్లేశ్వరరావు (ఫైల్)

మెళియాపుట్టి: మండలంలోని దుర్బలాపురానికి చెందిన రాడ ఢిల్లేశ్వర రావు (24) విశాఖ పట్నంలో శనివారం రాత్రి మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలము కున్నాయి. విశాఖ పట్నంలో గత రెండేళ్లుగా హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదువుకుంటున్నాడు. ఉంటున్న గదిలోనే ఉరి వేసుకుని అనుమానాస్పదంగా మృతి చెందడంతో స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. ఒక్కగానొక్క కుమారుడు ప్రయోజకుడై కుటుంబాన్ని పోషిస్తాడను కుంటే ఇలా మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు శ్రీనివాస్, ధనలక్ష్మి, కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అమలు కున్నాయి.

ఫ్లైఓవర్ గోడను ఢీకొన్న ఇసుక లారీ

ఇసుక లారీ బోల్తా

లావేరు: మండలం జాతీయ రహదారి సుభద్రాపురం కూడలి సమీపంలోని ఆదివారం తెల్లవారు జామున ఇసుక లారీ అదుపుతప్పి ఫ్లైఓవర్ వంతెన గోడను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ నుజ్జునుజ్జు అవ్వగా వంతెనపై ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు విరిగి సర్వీసు రోడ్డుపై పడ్డాయి. ఈ ప్రమాదంలో ఎవరికి ఏమి కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా హైవే పోలీసులు చర్యలు చేపట్టారు. సర్వీసు రోడ్డులో పడిన ఇసుకను స్థానికులు ట్రాక్టర్లు, ఆటోలతో తరలించుకున్నారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

వైద్య శిబిరానికి స్పందన

ఆమదాలవలస: శ్రీ సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని 21వ వార్డు కుద్దిరాం గ్రామంలో మెట్టక్కివలస సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో 120 మంది రోగులకు వైద్యసేవలు అందించినట్లు జిల్లా సేవాదళ్ సమన్వయకర్త పప్పల నాగేశ్వరరావు తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ సమన్వయకర్త నరసింహమూర్తి, సహకారంతో రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సత్యసాయి జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు, ఆకెళ్ల రామలక్ష్మి, కన్వీనర్ కన్నేపల్లి వెంకట కామవధానులు, వైద్యులు పి.తాతయ్యలు, అనిత, బి.సాయికిరణ్, డాక్టర్ రుషికేశ్ పాల్గొన్నారు.

తెప్పలకు శ్రీశ్రీ కళావేదిక పురస్కారం

పలాస: కాకినాడ పిఆర్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, శ్రీశ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో కళావేదిక 149 జాతీయ ద్విశత కవి సమ్మేళనంలో పలాసకు చెందిన కవి, రచయిత జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి శ్రీశ్రీ కళావేదిక పురస్కారం లభించింది. చిరంజీవే అను కవితను చదివి ప్రశంసలు పొందారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తిని అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షులు డా.కత్తిమండ ప్రతాప్, జాతీయ ప్రధాన కార్యదర్శి డా.పార్థసారధి, కళావేదిక జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణం, చిట్టి లలిత కార్యవర్గం చేతులమీదుగా దుశ్శాలువా, జ్ఞాపిక, ప్రశంశాపత్రంతో ఘనంగా సత్కరించారు. పలు సాహితీ సాంస్కృతిక సంస్థలు కృష్ణమూర్తిని అభినందించారు.

ఫొటోగ్రఫీపై అవగాహన

కవిటి: మండలం రాజపురంలో ఫోటోగ్రాఫర్స్ సర్వీస్ సొసైటీ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బేసిక్ ఫోటోగ్రఫీ, ఔట్‌డోర్ లైటింగ్ టెక్నిక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు ఆరింగి గోపి మాట్లాడుతూ ఫోటోగ్రఫిలో మెళకువలు తప్పనిసరని, స్థానిక ఫోటోగ్రాఫర్లు ఇటువంటి అవగాహన కార్యక్రమాలు వినియోగించు కోవాలన్నారు.